అభివృద్ధి అడుగులు

దశాబ్దాలుగా అభివృద్ధికి దూరంగా ఉండిపోయిన మెట్ట ప్రాంతం ఆత్మకూరుకు దివంగత మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి హయాంలో జరిగిన అభివృద్ధితో ఊపిరి తెచ్చుకుంది. సాగునీటి వనరులు, పారిశ్రామికాభివృద్ధికి బీజాలు వేయడంతో అభివృద్ధి కొత్త పుంతలు తొక్కింది. ఆయన అకాల మరణం తర్వాత సోదరుడు మేకపాటి విక్రమ్‌రెడ్డి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యాక క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ కనీస పాటి మౌలిక వసతులు కల్పించేందుకు చొరవ తీసుకుంటున్నారు. ఏడాది కాలంగా గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో తన దృష్టికి వచ్చిన సమస్యలు, అభివృద్ధి పనులకు సంబంధించి ప్రణాళిక రూపొందించుకుని శరవేగంగా చేపడుతున్నారు.

- గడప గడపకు మన ప్రభుత్వంలో మౌలిక అవసరాలు గుర్తింపు
- వెను వెంటనే పనులు ప్రారంభం
- గ్రామాల్లో కొనసాగుతున్న పనులు


ఏఎస్‌పేట మండలం పెద్దఅబ్బీపురంలో నూతన కల్వర్టు నిర్మాణం

ఆత్మకూరు : ఆత్మకూరు నియోజకవర్గంలో మేకపాటి మార్క్ అభివృద్ధి అడుగులు పడుతున్నాయి. ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ఏడాది కాలంగా గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గంలోని మున్సిపాలిటీతో పాటు ఆరు మండలాల్లో 78 సచివాలయాల్లో 115 పైగా పంచాయతీల్లో పర్యటించారు. మొత్తం 93 సచివాలయాలు ఉండగా, 78 సచివాలయాల పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వంలో సమస్యలు గుర్తించి మౌలిక వసతుల ఏర్పాటు కోసం రూ.15.60 కోట్ల మంజూరు చేయించారు. ప్రస్తుతం సిమెంటు రోడ్లు, సైడ్ డ్రైన్లు, కల్వర్టు నిర్మాణం, విద్యుద్దీకరణ, తదితర ప్రధాన మౌలిక వసతుల పనులు ముమ్మరంగా సాగుతోన్నాయి. షెడ్యూల్ ప్రకారం ఇంటింటికి తిరుగుతూ నాలుగేళ్ల వ్యవధిలో ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమం ద్వారా అందిన వివరాలను, నిధులను వారికి తెలియజేస్తూ అవి ఏ మేరకు ఆ కుటుంబాలకు సద్వినియోగం అయింది ఆరా తీశారు. ఆ ప్రాంతాలకు కావాల్సిన వసతులపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో నూతన విద్యుత్ లైన్లు, దెబ్బతిన్న స్తంభాల మార్పునకు ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. నియోజకవర్గం మౌలిక వసతుల ఏర్పాటు కోసం నిధులు మంజూరు చేయించారు. ఆత్మకూరు మున్సిపాలిటీకి రూ.1.60 కోట్లు, సంగం మండలానికి రూ.2.60 కోట్లు, అనుమసముద్రంపేటకు రూ.2.20 కోట్లు, మర్రిపాడు రూ.3 కోట్లు, చేజర్ల రూ.2.40 కోట్లు, అనంతసాగరం రూ.2 కోట్లు, ఆత్మకూరుకు రూ.1.80 కోట్లు చొప్పున నిధులు మంజూరు చేయించారు. దీంతో ఇప్పటికే రూ.60 శాతం పనులు పూర్తయ్యాయి. మిగిలిన పనులు వివిధ దశల్లో ఉన్నాయి. నియోజకవర్గ అభివృద్ధి కోసం ప్రణాళికాబద్ధంగా పనులు చేయిస్తుండడంతో పాటు కలెక్టర్ మొదలు, డివిజన్ స్థాయి అధికారులతో పలుమార్లు రివ్యూ సమావేశాలు నిర్వహించి రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తుండడంతో ఎమ్మెల్యేకు ప్రజలు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.


గడప గడపకు ప్రభుత్వంలో దివ్యాంగ మహిళ ద్వారా సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి (ఫైల్)

ఆనకట్ట సుందరీకరణ పనుల పరిశీలన


ఆనకట్ట పనులు పరిశీలిస్తున్న అధికారులు

ఉదయగిరి: పట్టణంలోని ట్యాంక్ బండ్ సమీపంలోని ఆనకట్టలో గ్రామ కొలను పథకం ద్వారా చేపడుతున్న సుందరీకరణ పనులను బుధవారం క్వాలిటీ కంట్రోల్ ఎస్ఈ వెంకట్రామయ్య, జలవనరుల శాఖ ఈఈ వెంకటేశ్వర్లు పరిశీలించారు. ఆనకట్ట ఆధునికీకరణ మ్యాప్‌ను క్షుణ్ణంగా పరిశీలించారు. మట్టికట్ట, రివిట్‌మెంట్ పనులను తనిఖీ చేసి సిబ్బందికి సూచనలు, సలహాలు అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆనకట్ట అభివృద్ధి పనులు నాణ్యతగా జరుగుతున్నాయన్నారు. ఈ పనులు పూర్తయితే ఉదయగిరి పట్టణానికి కళ వస్తుందన్నారు. పట్టణంలో నుంచి వచ్చే మురుగునీరు బయటకు వెళ్లేందుకు ప్రత్యేక కాలువను ఏర్పాటు చేయాలని అధికారులకు, కాంట్రాక్టరుకు సూచించారు. ముందుగా వారు జలవనరులశాఖ కార్యాలయ ఆవరణలో ఉన్న శిథిల భవనాలను ఆర్‌అండ్‌బీ అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం గండిపాళెం జలాశయ క్రస్టుగేట్లకు సంబంధించిన పెయింటింగ్ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో ఇరిగేషన్, క్వాలిటీ కంట్రోల్ డీఈఈలు చక్రధర్, రాజేంద్ర ప్రసాద్, ఏఈలు చంద్రమౌళి, వేణు, కాంట్రాక్టర్ అక్కి భాస్కరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ముందుచూపుతో ఉండాలి

- డీపీఎం కామాక్షి


మాట్లాడుతున్న డీపీఎం కామాక్షి

చేజర్ల: పొదుపు సంఘాల్లో మహిళలు ముందు చూపుతో ఉండాలని నెల్లూరు జిల్లా ఐబీ డీపీఎం (డిస్ట్రిక్ట్ ప్రాజెక్ట్ మేనేజర్) బి కామాక్షి తెలిపారు. బుధవారం స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో ఆఫీస్ బ్యారర్స్ ఎన్ఆర్ఎల్ఎం (జాతీయ గ్రామీణ జీవనోపాధుల మిషన్) విజన్ మీటింగ్ శిక్షణ తరగతుల్లో ఆమె మాట్లాడారు. రాబోయే ఐదేళ్లలో వారి స్థితిగతులు కుటుంబం, గ్రామాభివృద్ధి చెందాలంటే మంచి ప్రణాళికలు లక్ష్యాలు ఏర్పరచుకోవాలన్నారు. ఆరోగ్యం, వ్యవసాయం తదితర రంగాల్లో అభివృద్ధి సాధించి జీవన ప్రమాణాలు మెరుగు పరచాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం చీర్ల సుజన సీసీలు భాస్కర్, పుల్లయ్య, ప్రసాద్, సుమతి, అకౌంటెంట్ వహీద, సంఘమిత్ర అధ్యక్షురాలు పెంచలమ్మ పాల్గొన్నారు.

ఉత్తమ విద్యార్థులకు ప్రోత్సాహక నగదు బహుమతులు


ఉత్తీర్ణ సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహక నగదు బహుమతులను అందచేస్తున్న దృశ్యం

వరికుంటపాడు: వరికుంటపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2022- 23 విద్యా సంవత్సరాల్లో పదో తరగతిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థిని, విద్యార్థులకు దివంగత డాక్టర్ సాధు రమాపండు జ్ఞాపకార్థం ఆయన సతీమణి అంజలి, కుమారులు శ్రీకాంత్, చక్రధర్, శ్రీనాథ్ బుధవారం నగదు బహుమతులను అందజేశారు. ప్రముఖ పారిశ్రామికవేత్తలు సాధు గాంధీ, సుంకర అంజనాద్రి, మాజీ ఎంపీపీ సుంకర వెంకటాద్రి మొదటి స్థానంలో రూ.11,116, రెండో స్థానంలో రూ.9,116, మూడో స్థానంలో నిలిచిన విద్యార్థికి రూ.6,116 వంతున బహుమతులు అందజేశారు. వారు మాట్లాడుతూ ఈ పాఠశాలలో చదివి ఎక్కడెక్కడో విదేశాల్లో ఉద్యోగాలు చేసుకుంటున్నామని, విద్యార్థులు కూడా ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. రమాపండు ఈ పాఠశాలలో చదివి వ్యవసాయంలో డాక్టరేట్‌ను పొందారని, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఒక ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్తగా పేరు పొందారన్నారు. ప్రతి ఒక్క విద్యార్థి చక్కగా చదువుకుని పాఠశాలకు ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు, పుట్టిన గ్రామానికి మంచి పేరు తీసుకు రావాలని తెలిపారు. అనంతరం పాఠశాల సమస్యలను సుంకర అంజనాద్రి, సుంకర వెంకటాద్రి దృష్టికి తీసుకెళ్లగా పాఠశాల ప్రహరీ, గేటు నిర్మాణం, సరస్వతీ దేవి విగ్రహం, వాటర్ ప్లాంట్ చుట్టూ గ్రిల్స్ ఏర్పాటు చేయిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం వీరభద్రయ్య, స్థానికులు సుంకర రవి, సుంకర రమణయ్య, సుంకర వెంకటేశ్వర్లు, నాయుడు ప్రకాష్, సుంకర కృష్ణయ్య, లింగం మాలకొండయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి రైతు ఈ–పంట నమోదు చేసుకోవాలి

అల్లూరు: మండల పరిధిలో సాగు చేసే ప్రతి రైతు తప్పని సరిగా ఈ–పంట నమోదు చేసుకోవాలని ఏఓ వి.అశోక్ తెలిపారు.

ఆర్బీకేల్లోని వీఏఏల వద్ద ఈ నెల 30వ తేదీ లోపల ఈ–పంట నమోదు, ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించి పంట నష్టం జరిగితే ప్రభుత్వం అందించే ఇన్‌పుట్ సబ్సిడీ రావడానికి, సున్నావడ్డీ, పంట రుణాలు పొందడానికి ఉపయోగపడుతుందన్నారు.

క్లుప్తంగా

అభయాంజనేయస్వామి ఆలయంలో సంప్రోక్షణ



సంగం: అభయాంజనేయస్వామి ఆలయంలో బుధవారం అర్చకులు సంప్రోక్షణ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ముందుగా భక్తులు పెన్నానది నది నుంచి కలశ నీటితో ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారికి అభిషేకాలు నిర్వహించారు. అనంతరం హోమాలు, పూర్ణాహుతి నిర్వహించారు. స్వామి వారిని పరిమళ పుష్పాలతో అలంకరించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

విశ్వ కవి గుర్రం జాషువా


జాషువా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

ఆత్మకూరురూరల్: అవమానాలనే తన గెలుపునకు సోపానాలుగా చేసుకుని తన కలం రచనల ద్వారా సమాజానికి సమానత్వాన్ని ప్రబోధించిన విశ్వ కవి గుర్రం జాషువా అని పలువురు వక్తలు కొనియాడారు. మర్రిపాడు కేజీబీవీలో బుధవారం జాషువా జయంతి వేడుకలను లైబ్రేరియన్ నారాయణరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. రాష్ట్ర క్రీడాభివృద్ధి సంస్థ డైరెక్టర్ కాలువ నరసింహులు మాట్లాడుతూ ఆ నాటి సమాజంలో గుర్రం జాషువా ఎదుర్కొన్న అవమానాలు, ఛీత్కారాలు చాలా బాధాకరమైనవన్నారు. తన అపురూప కవితలతో భావితరాలకు జాషువా అందించిన సందేశం ఆదర్శనీయమన్నారు. వైఎస్సార్సీపీ మాజీ కన్వీనర్ గంగవరపు శ్రీనివాసులునాయుడు మాట్లాడుతూ జాషువా రచనలను నేటి తరం ఆదర్శంగా తీసుకుని సమాజ అభ్యున్నతికి పాటుపడాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ లక్ష్మీదేవి, ఉపాధ్యాయులు భాగ్యలక్ష్మి, కళ్యాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళా రైతుల స్వయం అభివృద్ధిపై దృష్టి

సీతారామపురం: మహిళా రైతుల స్వయ అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని, మహిళ రైతులకు ప్రోత్సాహకాలు అందజేసి వారి మరింత వ్యవసాయ రంగంలో ముందుకు తీసుకెళ్లేందుకు కార్యాచరణ ప్రణాళిక అమలు చేస్తున్నట్లు ఏపీఎం బి. సుధాకర్ అన్నారు. స్థానిక స్త్రీ, శక్తి భవనంలో బుధవారం జరిగిన రైతు ఉత్పత్తిదారులు కార్యనిర్వాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. భూమి ఉన్న మహిళా రైతులను మాత్రమే రైతు సంఘంలో సభ్యత్వం ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్న మహిళ రైతులు సభ్యులుగా చేరవచ్చు అని తెలిపారు. కోఆపరేటివ్ సబ్‌డివిజన్ అధికారి శ్రీనివాసరెడ్డి వివిధ రైతు సంఘాలను రిజిస్ట్రేషన్ చేసేందుకు అర్హతను పరిశీలించారు. సమావేశంలో సీసీలు ఎస్.తిరుపాలు, మరియమ్మ, అకౌంటెంట్ పద్మావతి, మండల సమాఖ్య అధ్యక్షురాలు సులోచన పాల్గొన్నారు.

ఓబుల్‌రెడ్డికి ఉపాధి సిబ్బంది సన్మానం



ఉదయగిరి: ఉదయగిరి మండల వైఎస్సార్సీపీ అధ్యక్షుడు గానుగపెంట ఓబుల్‌రెడ్డిని బుధవారం ఉపాధి హామీ పథకం సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఏపీఓ శ్రీనివాసులు ఆధ్వర్యంలో సిబ్బంది శాలువా, పూలమాలతో సత్కరించారు. ఓబుల్‌రెడ్డి మాట్లాడుతూ ఉపాధి సిబ్బంది ప్రతి పంచాయతీలో పనులు చేపట్టి ప్రతి కూలీకి ఉపాధి పని కల్పించాలన్నారు. మండలాన్ని ప్రథమ స్థానంలో నిలపాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ హరి, వైఎస్సార్సీపీ నాయకులు కె.ప్రభాకర్ పాల్గొన్నారు.

ఉన్నతంగా చదివి ఉజ్వల భవిష్యత్‌ను నిర్మించుకోండి

ఆత్మకూరు: తల్లిదండ్రులు ఎన్నో ఆశయాలతో తాము కష్టపడుతూ పిల్లలను ఉన్నత స్థితిలో చూడాలని కలలు కంటారని, వారి కలలు నెరవేర్చేలా బాగా చదివి ఉజ్వల భవిష్యత్‌ను నిర్మించుకోవాలని పలువురు వక్తలు అన్నారు. పట్టణంలోని ఏఎస్ఆర్ డిగ్రీ కళాశాల ఫ్రెషర్స్‌డే వేడుకలను మున్సిపల్ పరిధిలోని శ్రీధర్ గార్డెన్స్‌లో బుధవారం నిర్వహించారు. తొలి సంవత్సరం చేరిన విద్యార్థులకు ప్రత్యేకంగా కౌన్సెలింగ్ ఇచ్చి భవిష్యత్‌లో ఉద్యోగాల కోసం చేయాల్సిన కృషిపై శిక్షణ ఇస్తున్నట్లు కరస్పాండెంట్ సుబ్బారెడ్డి తెలిపారు. కళాశాల కార్యవర్గ సభ్యులు డి.ప్రసాద్, ఎ సురేంద్రరెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే శారీరక పెరుగుదల

సీతారామపురం: అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పౌష్టికాహారంతో చిన్నారుల్లో శారీరక ధృఢత్వం పెరుగుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రత్నమ్మ అన్నారు. మండలంలోని సంజీవరెడ్డినగర్ అంగన్‌వాడీ కేంద్రంలో వారోత్సవాలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ బిడ్డ పుట్టిన తర్వాత వెయ్యి రోజుల్లో చిన్నారుల్లో శారీరక, మానసిక పెరుగుదల ఎక్కువ ఉంటుందని, ఆ సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కార్యకర్త మహాలక్ష్మి పాల్గొన్నారు.

సంతాప సభగా మున్సిపల్ కౌన్సిల్


కౌన్సిలర్ మృతికి సంతాపం తెలుపుతున్న కౌన్సిల్ పాలకవర్గం

ఆత్మకూరు: మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం చైర్‌పర్సన్ గోపారం వెంకటరమణమ్మ అధ్యక్షతలో నిర్వహించారు. తొలుత నిర్ణయించిన మేరకు అజెండాలో పలు అభివృద్ధి పనులను చేర్చి వాటిని సభ్యుల ఆమోదం కోసం సభలో వినిపించాల్సి పరిస్థితి. అయితే మున్సిపల్ 12వ వార్డు కౌన్సిలర్ కొండా యుగలక్ష్మి ఆకస్మికంగా మృతి చెందడంతో సభ్యుల ఆమోదం మేరకు సమావేశాన్ని సంతాప సభగా నిర్వహించాలని నిర్ణయించారు. దీంతో కొండా యుగలక్ష్మి చిత్రపటానికి చైర్‌పర్సన్, వైస్ చైర్మన్లు డాక్టర్ కేవీ శ్రావణ్‌కుమార్, షేక్ సర్దార్‌లు కౌన్సిలర్లతో కలిసి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. కౌన్సిలర్‌గా చిన్న వయస్సులోనే ఎంపికైన ఆమె ఆ వార్డులో అభివృద్ధి పనుల కోసం తన వంతు గళం వినిపించే వారన్నారు. ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. మహిళా కౌన్సిలర్‌ను కోల్పోవడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ బల్లి నాగేశ్వరరావు, వార్డు కౌన్సిలర్లు, ఏఈలు జె ప్రసాద్, వరలక్ష్మి, ఆర్ఐ ఖాసీం, సిబ్బంది ఉన్నారు.

పౌష్టికాహారంతో రక్తహీనత నివారణ


పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

దుత్తలూరు: మంచి పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా రక్తహీనత సమస్యను అధిగమించవచ్చని ఉదయగిరి ఐసీడీఎస్ సీడీపీఓ పి.లావణ్య తెలిపారు. పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా బుధవారం మండలంలోని దుత్తలూరు సెక్టార్ పరిధిలోని పూసలకాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహార ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కార్యకర్త నూర్జహాన్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పలు రకాల ఆకు, కాయగూరలు, చిరుధాన్యాలతో ప్రదర్శన ఏర్పాటు చేసి గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. వైద్యశాలలో బాలింతలు, గర్భిణులు, చిన్నారులకు అందించే పలు రకాల టీకాలు, మందులపై వైద్యాధికారి డాక్టర్ వనజ వివరించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ బీబీజాన్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షాను, మహిళా పోలీసు అరుణ తదితరులు పాల్గొన్నారు.

కల్లుగీత కార్మికుడికి రూ.10 వేలు సహాయం


కల్లుగీత కార్మికునికి ఆర్థిక సహాయం అందజేస్తున్న గౌడ సంఘ నేతలు

సంగం: మండలంలోని దువ్వూరుకు చెందిన కల్లు గీత కార్మికుడు దాసరి వెంకటయ్య చెట్టుపై నుంచి పడి గాయపడడంతో జిల్లా గౌడ సంఘం అధ్యక్షుడు తోట ప్రభాకర్ బుధవారం రూ.10 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఆయన మాట్లాడుతూ నెల్లూరు జిల్లా గౌడ కల్లు గీత కార్మికుల సంఘం, గౌడ సేవా సమితి ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షుడు కోసూరు గోవిందయ్యగౌడ్ ఆశయ సాధన కోసం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కోసూరు రాజశేఖర్‌గౌడ్ పర్యవేక్షణలో కల్లుగీత కార్మికులను ఆదుకునేందుకు ముందుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌడ సంఘం ఉపాధ్యక్షులు ఉప్పల రామకృష్ణయ్య, తాతా రమణయ్య, జిల్లా గౌడ సంఘం జాయింట్ సెక్రటరీ దాసరి హజరత్, యువత కోశాధికారి చిన్న గోవింద్ గౌడ్, పంది కోటయ్య, తిరగాబత్తిన వెంకటేశ్వర్లు, జడపల్లి సుధాకర్, కల్లుగీత కార్మికులు పాల్గొన్నారు.

వహీదాకు దాదా సాహెబ్ ఫాల్కే అవార్డు హర్షణీయం

కావలి: ప్రముఖ హిందీ చలనచిత్ర నాయిక పద్మశ్రీ,, పద్మభూషణ్ వహీదా రెహమాన్ ప్రతిష్టాత్మక దాదా సాహెబ్ ఫాల్కే అవార్డుకు ఎంపిక కావడం గర్వకారణమని కావలి ఉమెన్ ఫోర్స్ కన్వీనర్ సి.శారద హర్షం వ్యక్తం చేశారు. 13 ఏళ్లకే తండ్రి రెహమాన్ మరణించడం దురదృష్టమన్నారు. 'కళకు మతమే లేదు' అని చాటుతూ హిందూ పురాణాల్లో దేవతలను స్తుతించే పాటలతో భరత నాట్యాన్ని నేర్చుకుని మొట్టమొదట ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ గవర్నర్ రాజగోపాలాచారి వాల్తేరు వస్తున్న సందర్భంగా నాట్య ప్రదర్శన చేయడం, ఆమె నాట్యానికి రాజగోపాలాచారి ముగ్ధులైనట్లు గుర్తు చేశారు. వహీదాకు 16 ఏళ్లు వచ్చే సరికి ముంబయిలో ఎల్వీ ప్రసాద్‌తో పాటు, నిర్మాత సీవీఆర్ ప్రసాద్ వహీదాను 'రోజులు మారాయి' సినిమాలో 'ఏరువాకా సాగారో రన్నో చిన్నన్న' పాట నాట్యానికి ఎంపిక చేశారన్నారు. ఆ నృత్యం సినిమాకు మంచి పేరు తేవడంతో హిందీ సినీ దర్శకులు, నిర్మాతలు వహీదా రెహమాన్‌ను వరుసగా తమ చిత్రాల్లో ఎంపిక చేసుకోవడంతో బాలీవుడ్ క్వీన్ అయిందన్నారు. ప్రస్తుతం 85 ఏళ్ల వయసులో ఆమెకు దాదా సాహెబ్ ఫాల్కే అవార్డు రావడం ఆమెను చలన చిత్రరంగ చరిత్రలో ధృవతారగా నిలిపినట్లయిందని శారద తెలిపారు.

సూక్ష్మ ఆహార శుద్ధి పరిశ్రమలకు ప్రభుత్వ ప్రోత్సాహం

కావలి: ఆహార పరిశ్రమలకు 35 శాతం రాయితీతో బ్యాంకుల నుంచి రుణాలు మంజూరయ్యేలా ప్రభుత్వం సహకారం అందిస్తోందని ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ పీడీ బి. శ్రీనివాసులు తెలిపారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్, ఉద్యానశాఖ, డీఆర్‌డీఏ సమన్వయంతో సూక్ష్మ ఆహార శుద్ధి పరిశ్రమల ఏర్పాటుకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆహార శుద్ధి పరిశ్రమలకు రాయితీల వివరాలు తెలియజేశారు. పలుచోట్ల సూక్ష్మ ఆహార శుద్ధి పరిశ్రమలు ఏర్పాటు చేసి విజయవంతం అయిన వారి అనుభవాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ కృష్ణమోహన్, ఉద్యానశాఖాధికారిణి సుధమయి, ఏపీఎం కాంతారావు డీఆర్‌పీ భానుచందర్, కావలి, జలదంకి మండలాల రైతు సంఘం సభ్యులు, పొదుపు సంఘాల మహిళలు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు కావలియడవల్లి విద్యార్థిని


కాత్యాయణి

అనుమసముద్రంపేట: నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో జరిగిన జిల్లా స్థాయి కబడ్డీ ఎంపికల్లో అండర్–14 విభాగంలో ఏఎస్‌పేట మండలం కావలియడవల్లి విద్యార్థిని బండా కాత్యాయణి ఎంపికైంది. నవంబర్‌లో కడపలో జరిగే స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర స్థాయి కబడ్డీ టోర్నమెంట్‌కు జిల్లా కబడ్డీ జట్టు తరపున ఆడనున్నట్లు పాఠశాల హెచ్ఎం ఓ వెంకటేశ్వరరావు తెలిపారు. పీఈటీ గురవయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థిని తల్లిదండ్రులు అభినందించారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఉన్నీసా


అహ్మద్ ఉన్నీసాను అభినందిస్తున్న ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు

కలిగిరి: మండలంలోని ఏపీ మోడల్ పాఠశాలలో చదువుతున్న షేక్ అహ్మద్ ఉన్నీసా అండర్–14 విభాగంలో రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు నెల్లూరు జట్టుకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపల్ ఎ.శ్రీను బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆ విద్యార్థినితో పాటు పాఠశాల పీఈటీ కర్నాటి వెంగళరావును ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు అభినందించారు.

త్రోబాల్ పోటీలకు ఇస్కదామెర్ల విద్యార్థిని



కొండాపురం: మండలంలోని ఇస్కదామెర్ల ఉన్నత పాఠశాలకు చెందిన కొటాలపల్లి నమిత నెల్లూరులో జరిగిన జిల్లా స్థాయి అండర్–14 బాలికల విభాగం త్రోబాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం మధుసూదన్‌రావు బుధవారం తెలిపారు. ఆ విద్యార్థిని పీఈటీ శ్రీనివాసులు, ఉపాధ్యాయులు అభినందించారు.

జిల్లా టీమ్‌కు సంగం విద్యార్థులు


విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్

సంగం: స్కూల్ గేమ్స్ అండర్–17 బాలుర కబడ్డీ విభాగంలో మండలంలోని మర్రిపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన అభిలాష్ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జిల్లా జట్టుకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం ఎస్.నరసింహమూర్తి తెలిపారు. ఖోఖో విభాగంలో పాఠశాలకు చెందిన నందకిషోర్ జిల్లా జట్టుకు ఎంపికైనట్లు తెలిపారు.

కబడ్డీ జట్టుకు అనంతసాగరం విద్యార్థి



చేజర్ల(సోమశిల): రాష్ట్ర స్థాయి అండర్–14 కబడ్డీ జట్టుకు అనంతసాగరం టీజేఎస్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థి జీవీ హేమంత్‌రెడ్డి ఎంపికయ్యారని ఆ స్కూల్ హెచ్ఎం లక్ష్మీప్రసన్న బుధవారం తెలిపారు. అక్టోబరులో అన్నమయ్య జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా జట్టు తరపున పాల్గొంటారని తెలిపారు. పీఈటీ ఆత్మకూరు రమేష్, ఉపాధ్యాయులు అభినందించారు.

అక్టోబర్ 1న పాటల పోటీలు

కావలి: కావలి ఎల్డర్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో అక్టోబరు 1వ తేదీ 'ప్రపంచ వృద్ధుల దినోత్సవం' పురస్కరించుకుని సాహిత్య ప్రాముఖ్యత ఉన్న పాటల పోటీ నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు జేబీఎం నాయుడు ఒక ప్రకటనలో బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక వాయునందన ప్రెస్ రోడ్డులోని శ్రీనివాస కల్యాణ మండపంలో ఉదయం 9 గంటలకు జరుగుతాయన్నారు. 55 ఏళ్లు పైబడిన మహిళలు, పురుషులు మాత్రమే పోటీలకు అర్హులని చెప్పారు. విజేతలకు బహుమతి ప్రదానం, ప్రముఖులైన వృద్ధులను ఎల్డర్స్ క్లబ్ సత్కరిస్తుందని చెప్పారు.

ఆమని చిరువెళ్ల చెరువు లీజు వేలం

చేజర్ల (సోమశిల): అనంతసాగరం మండలం ఆమని చిరువెళ్లలోని చెరువులో చేపల పెంపకానికి లీజు వేలం బుధవారం నిర్వహించారు. ప్రభుత్వ మద్దతు ధర రూ2.75 లక్షలు కాగా, జి తిరిపాల్ రూ.2.85 లక్షలకు దక్కించుకున్నాడు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి డి రమేష్, ఈఓపీఆర్డీ ఏ సురేష్ కుమార్, సర్పంచ్ లక్ష్మమ్మ, గ్రామ వైఎస్సార్సీపీ నేత సుబ్బారావు పాల్గొన్నారు.

ముమ్మరంగా రీసర్వే ఫీల్డ్ వెరిఫికేషన్

అల్లూరు: మండలంలోని ఇస్కపల్లి పంచాయతీలో రీసర్వే జరిగిన ఫీల్డ్ వెరిఫికేషన్ ముమ్మరంగా జరుగుతుందని రీసర్వే డీటీ సైమన్‌బాబు తెలియజేశారు. గతంలో డ్రోన్ సర్వే నిర్వహించిన పొలాల వద్దకు క్షేత్రస్థాయిలో తమ సర్వేయర్లు, వీఆర్వోలు, వీఆర్ఏలు కొన్ని బృందాలుగా ఏర్పడి పక్కా సమాచారాన్ని రైతుల వద్ద సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో సమాచారం సేకరించడంతో 100 శాతం కచ్చితత్వంతో రైతులకు మేలు చేకూరుతుందన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

సంగం: ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ గోపి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ కంటాబత్తిన పద్మావతమ్మ అధ్యక్షతన ఉదయం 10 గంటలకు జరిగే ఈ సర్వసభ్య సమావేశానికి అధికారులు, ప్రజాప్రతినిధులు, హాజరుకావాలని కోరారు.